క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని రూరల్ : మండలంలో సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. బైచిగేరి, గోనభావి, పెద్దహరివాణం, పర్వతాపురం గ్రామాల్లో వస్‌టైం కన్వర్షన్ ప్రాంతాలను, పెద్దహరివాణంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి పురోగతిపై అధికారులతో చర్చించారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. హాన్వాళ్ గ్రామంలో సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. కొంతమంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసిందన్నారు. ప్రవర్తన మార్చుకోవాలని లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆ గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, సచివాలయ సిబ్బంది సబ్ కలెక్టర్‌ను సన్మానించారు.

ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి



డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్‌పీఎస్‌ఎఫ్ నాయకులు

ఆదోని అర్బన్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రయివేట్, కార్పొరేటర్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతికి రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ (ఆర్‌పీఎస్‌ఎఫ్) నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్, నాయకులు అఫ్రీద్, బాలు, భీమ, కళ్యాణ్ మాట్లాడుతూ ప్రయివేట్ ఆస్పత్రులు టెస్టులు, మందుల పేరుతో రోగులను దోచుకుంటున్నాయని ఆరోపించారు. స్కానింగ్‌లకు రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు వసూలు చేస్తున్నాయన్నారు. డివిజన్‌లోని ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం



చెట్ల కొమ్మల మధ్య విద్యుత్ తీగలు

ఆదోని అర్బన్ : సాదాపురం పంచాయతీ పరిధిలోని చైతన్యకాలనీలో ఉన్న మదర్‌థెరిస్సా పార్క్ వద్ద విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. చెట్లు ఏపుగా పెరిగి తీగలకు తగలడంతో గాలులు వీచినప్పుడు మంటలు చెలరేగుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ప్రమాదం జరగక ముందే విద్యుత్ అధికారులు స్పందించి చెట్ల కొమ్మలు కత్తరించాలని వారు కోరుతున్నారు.

మున్సిపల్ స్థలం స్వాధీనం



ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

ఆదోని టౌన్: పట్టణంలోని ఎస్కేడీ కాలనీలో ఆక్రమణకు గురైన మునిసిపల్ స్థలాన్ని అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 65 సెంట్ల స్థలంలో ఏపుగా పెరిగిన కంప చెట్లను జేసీబీ సాయంతో తొలగించి కంచె ఏర్పాటు చేశారు. త్వరలో ఈ స్థలాన్ని పార్కుగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు.

మార్కెట్‌యార్డు చైర్మన్‌కు సన్మానం



మాబాషాను సన్మానిస్తున్న సిబ్బంది

ఆదోని అర్బన్ : మార్కెట్ యార్డు చైర్మన్ మాబాషా మూడు సంవత్సరాల పదవీకాలం ముగియడంతో శుక్రవారం సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మార్కెట్ యార్డు చైర్మన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సుగూరప్పకు సన్మానం

ఆంధ్రప్రదేశ్ వీరశైవ సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సుగూరప్పను పలువురు శాలువ కప్పి సత్కరించారు. శుక్రవారం పట్టణంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్తలు, ప్రముఖులు చంద్రకాంత్‌రెడ్డి, మింటూఅగర్వాల్, హరిక్రిష్ణ, బుశెట్టి, రఫిక్, రామలింగయ్యయాదవ్ పాల్గొన్నారు.

చకచకా..

- రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణాలు వేగవంతం
- ఆదోని మండలంలో 23 కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటికే ఏడు గ్రామాల్లో భవనాలు పూర్తి
- ఒక్కొక్కటి రూ. 21.80 లక్షలతో సాగుతున్న పనులు



జాలిమంచిలో నిర్మాణంలో రైతు భరోసా కేంద్రం



బల్లేకల్‌లో లెంటల్ లెవెల్‌లో ఆర్‌బీకే



పెసలబండ గ్రామంలో పూర్తి అయిన రైతు భరోసా కేంద్రం

ఆదోని రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. గ్రామ స్థాయిలోనే వారికి విత్తనాల నుంచి పంట విక్రయాల దాకా అన్ని సేవలను అందించేందుకు ఏర్పాటు చేసిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులను ముమ్మరం చేసింది. అన్ని హంగులతో నిర్మించేందుకు ఒక్కో కేంద్రానికి రూ. 21.80 లక్షలు కేటాయించింది. ఆదోని మండలంలో మొత్తం 23 రైతు భరోసా కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా ఇప్పటి వరకు బసరకోడు, మదిర, గనేకల్, పెసలబండ, పెద్దహరివాణం, పెద్దతుంబళం, ఆరేకల్ గ్రామాల్లో పనులు పూర్తయ్యాయి. మరో ఆరు గ్రామాల్లో రూఫ్ లెవెల్‌లో, పది గ్రామాల్లో బేస్‌మట్టం లెవెల్‌ల్లో ఉన్నాయి. రెండుమూడు నెలల్లో ఆయా గ్రామాల్లో ఆర్‌బీకే నిర్మాణాలు పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

సేవలన్నీ స్థానికంగానే..

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అన్నీ సొంత ఊరిలోనే అందుతున్నాయి. గతంలో రైతులు వాటి కోసం పొలం పనులు మానుకుని మండల కేంద్రాలు, డివిజన్ కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. రోజంతా పడిగాపులు కాస్తూ క్యూల్లో నిలబడి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ఇప్పుడా ఆ దుస్థితి లేదు. రైతులు తమకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రైతు భరోసా కేంద్రాల్లో ఆర్డర్ ఇస్తే ఇంటి గుమ్మం వద్దే అందజేసే సదుపాయం ప్రభుత్వం కల్పించింది. దీంతో పాటు ఈ క్రాప్ బుకింగ్, పంట బీమా తదితర సేవలన్నీ రైతులకు స్థానికంగానే లభిస్తున్నాయి. పండించిన పంటను సైతం తక్కువ ధరకు దళారులకు విక్రయించి కర్షకులు నష్టపోకుండా ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తోంది.

తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు

కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీటి పైప్‌లైన్ పనులు చేపట్టారు. శుక్రవారం ఆ సంస్థ ఫెసిలిటేటర్ భీమేష్ ఆధ్వర్యంలో భూమి పూజ చేసి పనులు ప్రారంభించినట్లు గ్రామ సర్పంచ్ శివ మ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు సోమేష్ తెలిపారు.

ఆదర్శనీయులు అంబేడ్కర్



నగదును సేవాసమితికి అందజేస్తున్న గురునాథ్‌రెడ్డి

కౌతాళం: అంబేడ్కర్ ఆదర్శనీయులని వైఎస్సార్ సీపీ బాపురం గ్రామ యువజన నాయకుడు గురునాథ్ రెడ్డి, సర్పంచ్ శిల్పారెడ్డి అన్నారు. గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు వారు రూ.25, 116, ఎంపీటీసీ సౌభాగ్యమ్మ జైపాల్ దంపతులు రూ.10 వేల నగదును శుక్రవారం అంబేడ్కర్ సేవసమితికి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, సమితి సభ్యులు మూకన్న, వీరేష్, పామన్న, హనుమయ్య, పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై వేటు అప్రజాస్వామికం



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదోని టౌన్ : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం అప్రజాస్వామికమని ఆ పార్టీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ శుక్రవారం వారు స్థానిక పురవీధుల్లో ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి మున్సిపల్ మెయిన్ రోడ్డు, భీమాస్ సర్కిల్ వరకు ఈ కార్యక్రమం సాగింది. మోదీ సర్కారు రాహుల్‌గాంధీని రాజకీయంగా అణచివేసేందుకు కుట్రలు పన్నుతోందని కాంగ్రెస్ పార్టీ ఆదోని ఇన్‌చార్జి నీలకంఠప్ప, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మారుతి, పట్టణ కార్యదర్శి సాయినాథ్, ఐఎన్‌టీయూసీ పట్టణాధ్యక్షుడు ఇర్ఫాన్, సహాయ కార్యదర్శి నిసార్ అహ్మద్ ఆరోపించారు. బీజేపీ పెడుతున్న తప్పుడు కేసులకు తమ పార్టీ భయపడదన్నారు. ఇటీవల రాహుల్‌గాంధీ నిర్వహించిన 'భారత్ జోడో యాత్ర'కు లభించిన ప్రజాదరణను చూసి ఓర్వలేకనే ఆ పార్టీ నాయకులు కుట్రలకు తెర లేపారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్దిలేటి, ఫరూక్, షేక్షావలి, సుంకన్న, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులు వినతి

ఆదోని అర్బన్: కౌడల్‌పేటలో ఇతర మతస్తులు సెలూన్‌షాపు పెట్టడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారని, దీనివల్ల తమ జీవనోపాధికి ఆటంకం కలుగుతుందని నాయీ బ్రాహ్మణులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై శుక్రవారం నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ ఉపాధికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

27న వేలం పాటలు

కౌతాళం: మండల కేంద్రం కౌతాళం మేజర్ పంచాయతీకి ఆదాయ వనరులను సమకూర్చే వివిధ రకాల మార్కెట్‌లకు ఈనెల 27న బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే ఈ వేలంలో ఆసక్తి గలవారు దినసరి మార్కెట్‌కు రూ.10వేలు, కమేళాకు రూ.30 వేలు, బండి మెట్టకు రూ.లక్ష ధారవత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

కౌతాళం: బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, పాలక మండల చైర్మన్ నాగరాజ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ దేవస్థానం ప్రాంతంలో బాల్య వివాహాలను అనుమతించమన్నారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండి ఉంటేనే ఇక్కడ పెళ్లి చేయాలన్నారు. ఈ నిబంధనను అతిక్రమిస్తే 2006 చట్టం ప్రకారం రెండేళ్లు జైలు శిక్ష లేదా లక్ష రూపాయల జరిమాన ఉంటుందన్నారు.

అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కౌతాళం: రైతులు పండించే ప్రతి పంటకు మద్దతు ధర కల్పనకు పార్లమెంట్‌లో చట్టం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక రైతు సంఘం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణల బిల్లుతో పాటు నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. అలాగే అసంఘటిత కార్మికులకు కనీస వేతనం 26వేలు చెల్లించాలన్నారు. బీజేపీ అధికారంలో వచ్చిన తర్వాత ప్రజా సంపదను పెట్టుబడిదారులకు, కార్పొరేట్‌లకు దోచిపెడుతుందన్నారు. దీంతో దేశ ప్రజలపై పన్నుల భారం పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ రంగ సంస్థలను సైతం మోదీ సర్కారు ప్రైవేట్ పరం చేస్తుందని, దీనిని కలిసికట్టుగా అడ్డుకోవాలన్నారు. కేంద్రంపై పోరాటానికి ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న, రైతు సంఘం నాయకులు వెంకటేశ్, హనుమంతు, రామాంజినేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వీరేష్, రామదాస్, టీబీటీయూ నాయకులు ప్రహ్లాద, మనోహర, వీరేష్, వలి పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ఏరియా ఆస్పత్రి ఎదుట ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, నర్సులు, ఏఎన్‌ఎంలు

ఆదోని టౌన్: క్షయవ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దామని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.సత్యవతి ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారీ ప్రదర్శన నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి వద్ద ఈ ర్యాలీని డాక్టర్ సత్యవతి ప్రారంభించారు. 'దేశం గెలుస్తోంది-టీబీ ఓడిపోతోంది' అనే నినాదంతో చేపట్టిన ఈ ప్రదర్శనలో ఆమె మాట్లాడుతూ క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. 2024 నాటికి దేశంలో ఎక్కడా క్షయ కేసులు నమోదు కాకూడదన్నారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీ చర్యలు చేపట్టాయన్నారు. ఆరునెలల్లో వ్యాధి నయమయ్యేలా రోగులకు ఖరీదైన మందులు ఇస్తున్నాయన్నారు. దీంతో గత పదేళ్లతో పోలిస్తే నేడు వ్యాధిగ్రస్తుల సంఖ్య భారీగా తగ్గిపోయిందన్నారు. ఎవరికైనా వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించుకుని మందులు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దినేష్‌కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, ఎయిడ్స్‌వ్యాధి ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

కోసిగికి రూ. 21.23 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారిణి నూర్జహాన్

కోసిగి: కోసిగి మేజర్ పంచాయతీకి బహిరంగ వేలం పాటల్లో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి రూ.21.23లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆదోని డివిజనల్ పంచాయతీ అధికారిణి నూర్జహాన్ తెలిపారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న, గ్రామ సర్పంచ్ కుమారి అయ్యమ్మ, పంచాయతీ ఈఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని వారపు సంత మార్కెట్‌ను నాడుగేని నరసమ్మ రూ.2.75లక్షలకు, బండిమెట్టను నాడుగేని అయ్యన్న రూ.17.40 లక్షలకు, చిన్న కమేళాను కటికె నూర్ అహ్మద్ రూ.28 వేలకు, పెద్దకమేళాను సంజిపోగు అయ్యప్ప రూ.80 వేలకు బహిరంగ వేలంలో పోటా పోటీగా పాడి కైవసం చేసుకున్నారు. గతేడాది పంచాయతీ వేలంలో రూ. 20.98 లక్షలు రాగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.21.23 లక్షలు వచ్చినట్లు తెలిపారు. గతేడాది కన్నా ఈ ఏడాది రూ.24వేలు ఆదాయం పెరిగినట్లు తెలిపారు. వేలం పాటల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఈఓపీఆర్డీ ఆరూన్ రషీద్, నాయకులు మాణిక్యరాజు, రాజేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ ఉరుకుంద చిట్‌ఫండ్ కంపెనీకి మొట్టికాయ

- సేవాలోపంపై వినియోగదారుల కమిషన్ చర్యలు
- బాధితుడికి 9 శాతం వడ్డీతో చిట్ మొత్తం చెల్లించాలని ఆదేశం

కర్నూలు(లీగల్): చిట్ సభ్యుడి నుంచి కంతులు వసూలు చేసి ఆ తర్వాత చిట్ మొత్తాన్ని ఇవ్వకుండా సేవాలోపం చేసిన చేసిన శ్రీ ఉరుకుంద చిట్‌ఫండ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు చిట్ రిజిస్ట్రార్‌కు కర్నూలు వినియోగదారుల కమిషన్ శుక్రవారం తగిన రీతిలో మొట్టికాయ వేసింది. స్థానిక కొత్తపేటకు చెందిన ఫిర్యాది పి.వెంకటేశ్వర్లు 2014 సంవత్సరంలో చిట్‌ఫండ్ కంపెనీలో 5 లక్షల చిట్‌లో చేరి మొత్తం రూ.4,80,000 చెల్లించారు. 2018 సంవత్సరంలో చిట్ ఎత్తగా రూ.4.64 లక్షలకు రెండు చెక్కులను కంపెనీ ఇచ్చింది. చెక్కులను బ్యాంకులో వసూలు కోసం వేయగా చిట్ కంపెనీలో ఖాతా నిల్వలు లేకపోవడంతో బౌన్స్ అయ్యాయి. దీంతో ఫిర్యాదిదారుడు తనకు రావాల్సిన చిట్ మొత్తం చెల్లింపు కోసం చిట్స్ రిజిస్ట్రార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. చిట్‌ఫండ్ కంపెనీ స్పందించకపోవడంతో జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. బాధితుడికి డబ్బును చెల్లించకపోవడం సేవాలోపంగా నిర్ధారించి పి.వెంకటేశ్వర్లుకు చిట్ మొత్తం రూ.4,64,000కు 9 శాతం వడ్డీతో 45 రోజుల్లో చెల్లించాలని, కోర్టు ఖర్చుల కింద రూ.5 వేలు, మానసిక వేదనకు గురి చేసినందుకు రూ.20 వేలు చెల్లించాలని కమిషన్ అధ్యక్షులు కరణం కిషోర్‌కుమార్, సభ్యులు ఎన్.నారాయణరెడ్డి, ఎస్.నసీమా కౌసర్‌లు ఆదేశాలు జారీ చేశారు.

చేపల ఉత్పత్తికి ప్రణాళికలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో చేపల ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం వ్యవసాయ అనుబంధ శాఖలపై మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ..కౌతాళం నుంచి గూడూరు వరకు ఉన్న చౌడు భూముల్లో ఫిష్ పాండ్స్ ఏర్పాటు చేసి మత్స్య సంపదను పెంపొందించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం వ్యవసాయ, మైక్రో ఇరిగేషన్ విభాగాలతో సమన్వయం చేసుకోవాలన్నారు. రబీ పంటలకు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ పూర్తయ్యిందని, రైతులు 96 శాతం మంది ఈ-కేవైసీ ద్వారా ధ్రువీకరించుకున్నారని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పి.ఎల్.వరలక్ష్మి, మత్స్య శాఖ డీడీ శ్యామల, ఏపీ ఎంఐపీ ఈడీ ఉమాదేవి, ఉద్యానశాఖ ఏడీ పి.రామాంజనేయులు, పశుసంవర్ధక శాఖ జేడీ రామచంద్రయ్య, ఇరిగేషన్ ఎస్‌ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



గుడిమెరాళ్ల రామాంజినేయులు (ఫైల్)

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని కల్లుదేవకుంట-మంత్రాలయం గ్రామాల మధ్య గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. దేవనకొండ మండల కేంద్రానికి చెందిన గుడిమెరాళ్ల రామాంజినేయులు (35) గురువారం నందవరం మండలం ఇబ్రహీంపురం గ్రామంలో జరుగుతున్న దేవరకు హాజరయ్యాడు. అదే రోజు రాత్రి మంత్రాలయం మీదుగా బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో అగ్రిగోల్డ్ సమీపంలోని కల్వర్టు వద్ద సూచిక బోర్డును ఢీకొని పక్కనే ఉన్న గుంతలో పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహం వద్ద లభించిన మొబైల్ ఆధారంగా కుటుంబీకులు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి కేశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సోదరభావంతో మెలగాలి



ముస్లింలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు

మంత్రాలయం రూరల్: గ్రామాల్లో కలిసిమెలసి పండుగలు జరుపుకోవాలని, ఒకరికొక్కరు సోదరభావంతో మెలగాలని ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు సూచించారు. శుక్రవారం మండలంలోని ముస్లింలతో సమావేశమై ప్రశాంత వాతవరణంలో రంజా న్ మాసాన్ని జరుపుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధిద్దాం



సరస్వతి పూజ చేస్తున్న విద్యార్థినులు

కోసిగి: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఈ సారి వంద శాతం ఉత్తీర్ణత సాదిద్దామని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నీలకంఠ విద్యార్థినులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యాకమిటీ చైర్మెన్ ముకుంద కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థినుతో సరస్వతి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరుగుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు సులభమైన పద్ధతిలో సబ్జెక్ట్ వారీగా ఆరు పరీక్షలు ఉంటాయన్నారు. ప్రణాళికతో చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటండి



జాతీయ పోటీల్లో పాల్గొంటున్న రాష్ట్ర జట్టుకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన క్రీడా ప్రతినిధులు

కర్నూలు (టౌన్): ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు రాజస్థాన్‌లోని బన్వారలో నిర్వహిస్తున్న 46వ జాతీయస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు ప్రతిభ చాటాలని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రుద్రా రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం జాతీయ పోటీల్లో పాల్గొనే జట్టుకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో సత్య డెంటల్ క్లినిక్ అధినేత డాక్టర్ సర్వేశ్వరరెడ్డి స్పాన్సర్ చేసిన క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఇండియా కోచ్ బినయ్ పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ - వ్యక్తి మృతి

- మరొకరి పరిస్థితి విషమం



మృతిచెందిన శివయ్యస్వామి

ఆదోని రూరల్: కడితోట గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. హొళగుంద మండలం ముద్దటమాగి గ్రామానికి చెందిన జంగం శివయ్యస్వామి(62).. శుక్రవారం తోవి గ్రామానికి బయలుదేరుతుండగా అదే సమయంలో బైక్‌పై వెళ్తున్న మహేష్‌తో ఆదోని వరకు వెళ్లాడు. మార్గమధ్యలో కడితోట క్రాస్ వద్ద జి.హోసళ్లికి వెళ్తున్న ఆటో ప్రమాదవశాత్తూ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. ఇద్దరిని కర్నూలుకు తీసుకెళ్తుండగా జంగం శివయ్య మృతి చెందాడు. మహేష్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దతుంబళం హెడ్‌కానిస్టేబుల్ ఫక్రుద్దీన్ విలేకరులకు తెలిపారు.

వ్యక్తి అరెస్ట్

ఆదోని రూరల్: ఆదోని పట్టణం పర్వతాపురం గ్రామానికి చెందిన దూద్‌పీరా అనే వ్యక్తి కర్ణాటక మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం నాగరహాల్ గ్రామం నుంచి 635 90ఎం.ఎల్. ఓసీ టెట్రా ప్యాకెట్లను తీసుకొస్తుండగా అన్వాళ్ బస్టాండు వద్ద పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పెద్దతుంబళం ఏఎస్‌ఐ వెంకటరమణ విలేకరులకు తెలిపారు.

31న ఎన్నికలు

కర్నూలు(లీగల్): ఏపీ బార్ కౌన్సిల్ నిబంధనల మేరకు ఈ నెల 31న కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం ఎన్నికలు జరగనున్నాయి. గురువారం న్యాయవాద సంఘ సర్వసభ్య సమావేశంలో ఎన్నికల అధికారిగా న్యాయవాది కె.రాజమోహన్ రెడ్డిని నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ఇంటర్ పరీక్షల్లో ఇద్దరు డిబార్

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలో 123 కేంద్రాల్లో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. ఆత్మకూరులోని సెయింట్ థెరిస్సా జూనియర్ కాలేజీలో ఒక విద్యార్థి, చాగలమర్రి ఎస్‌వీఎంఐఎస్‌ఆర్ కాలేజీలో ఒక విద్యార్థి డిబార్ అయిన వారిలో ఉన్నారు. రెండో సంవత్సరం పరీక్షలకు 28,773 మంది హాజరయ్యారు.

ఇద్దరికి మెమోలు.. ఈ నెల 23వ తేదీన జరిగిన ఇంటర్మీడియెట్ ఫస్ట్ ఇయర్ పరీక్షల్లో ఒకే రోజున 21 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. తుగ్గలి ఏఎస్ జూనియర్ కాలేజీలోనే 12 మంది డిబార్ అయ్యారు. ఈ కాలేజీలోని సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న సీఎస్, డీఓలకు ఆర్‌ఐఓ గురవయ్య శెట్టి మెమోలు జారీ చేశారు. పరీక్ష కేంద్రంలోకి పంపే సమయంలో విద్యార్థులను తనిఖీ చేయని కారణంగానే 12 మంది చిట్టీలతో సెంటర్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది.

ప్రకృతి వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం



మాట్లాడుతున్న డాక్టర్ మురళీధర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ప్రకృతి వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేయవచ్చని నేచురోపతి వైద్యులు డాక్టర్ వీరం మురళీధర్‌రెడ్డి చెప్పారు. నేచురోపతి దినోత్సవంలో భాగంగా వీరం మురళీధర్‌రెడ్డి ఫౌండేషన్, ఎల్‌వీటీజీ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపి సంయుక్త ఆధ్వర్యంలో ఎస్‌ఐఎస్ ప్యూర్ వారి సహకారంతో శుక్రవారం ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరం మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైద్యం ద్వారా దీర్ఘకాలిక రుగ్మతలైన ఊబకాయం, చక్కెర వ్యాధి, రక్తపోటుల నుంచి కాపాడుకోవచ్చన్నారు. సహజసిద్ధంగా వ్యాధినిరోధక శక్తిని గాలి, నీరు, సూర్యరశ్మి ద్వారా పొందవచ్చన్నారు. ప్రోగ్రామ్ ఆర్గనైజర్ జె.రమణారెడ్డి మాట్లాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఏంజెల్ హారిక తదితరులు పాల్గొన్నారు.